
RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

| తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | ఆదివారం | 04 -02 - 2024 |
|---|---|---|---|
| సంపుటి: 1 | సంచిక : 261 | పేజీలు : 4 | వెల : 5/- |



"ఎంతో వినయంగా ఈ భారతరత్న పురస్కారాన్ని స్వీకరిస్తున్నాను. ఇది కేవలం నాకు మాత్రమే కాదు. నేను ఎన్నో ఏళ్లుగా నమ్ముకున్న సిద్ధాంతాలకు, విలువలకు దక్కిన పురస్కారంగా భావిస్తున్నాను. 14 ఏళ్లకే నేను =ూాలో చేరాను. అప్పుడే నిర్ణయించుకున్నాను. నేనే పని చేసినా అది దేశం కోసమే అని. ఈ జీవితం నాకోసం కాదు..దేశం కోసం అన్న సిద్ధాంతాన్నే బలంగా నమ్మాను. ఇవాళ పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయిని మనసారా స్మరించుకుంటున్నాను. లక్షలాది పార్టీ కార్యకర్తలు, స్వయంసేవకులతో పాటు ప్రజలందరికీ ధన్యవాదాలు. మా కుటుంబ సభ్యులు నాకు అన్ని విధాలా అండగా ఉన్నారు. వాళ్లే నా బలం. ఈ పురస్కారం అందించినందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీకి నా కృతజ్ఞతలు"

- ఎల్‌కే అద్వానీ,
బీజేపీ సీనియర్ నేత

## భారతరత్నం.. అద్వానీ..

**న్యూ ఢిల్లీ, ప్రభాతసూర్యుడు :** బీజేపీ అగ్రనేత అద్వానీ కి కేంద్ర ప్రభుత్వం భారత-రత్న ప్రకటించింది. ఆయనకు భారతరత్న ఇస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ ట్వీట్ చేశారు.ఎల్.కె.అద్వానీ పూర్తిపేరు లాల్ కృష్ణ అద్వానీ. 1927 నవంబర్ 8న పాకిస్థాన్లోని కరాచీలో జన్మించారు. కరాచీలోని సెయింట్ పాట్రిక్స్ హైస్కూల్లో పాఠశాల విద్య, పాక్లోని హైదరాబాద్లో డీజీ నేషనల్ కాలేజీలో న్యాయవిద్య చదివారు. 1947లో ఆరెస్సెస్ కరాచీ విభాగం కార్యదర్శిగా అద్వానీ విధులు చేపట్టారు. దేశ విభజన తర్వాత 1947 సెప్టెంబర్ 12న భారత్ కు అద్వానీ వలసవచ్చారు. 1957లో ఆరెస్సెస్ పిలుపుతో ఢిల్లీకి అద్వానీ వచ్చారు. 1960లో ఆర్గనైజర్ పత్రికలో జర్నలిస్టుగా అద్వానీ విధులు నిర్వహించారు. 1966లో ఢిల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్ మధ్యంతర ఎన్నికలో విజయం సాధించారు. 1977లో ఢిల్లీ మెట్రోపాలిటిన్ కౌన్సిల్ అధ్యక్షుడిగా అద్వానీ ఎన్నికయ్యారు. 1970-72లో భారతీయ జనసంఘ్ ఢిల్లీ విభాగం అధ్యక్షుడిగా అద్వానీ బాధ్యతలు చేపట్టారు. 1970లో రాజ్యసభ సభ్యుడిగా తొలిసారి ఎన్నికైయారు. 1973-76లో జన్సంఘ్ అధ్యక్షుడయ్యారు. 1974బి76లో రాజ్యసభలో ప్రతిపక్ష నేత. 1977-80లో జనతా

మిగతా 3వ పేజీలో...

## ఖమ్మం టిక్కెట్ కోసం భారీ ర్యాలీ



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని ఖమ్మం పార్లమెంట్ సీట్ కోసం దరఖాస్తు సమర్పించారు. తన మద్దతుదారులతో కలిసి అట్టహాసంగా గాంధీ భవన్‌కు వచ్చి స్వయంగా దరఖాస్తు చేశారు. ఇప్పటికే ఆమె మద్దతుదారులు ఒకసారి దరఖాస్తు సమర్పించారు. ఈరోజు ఆమె స్వయంగా వచ్చి అప్లికేషన్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆమె అనుచరులు బ్యాండ్ మేళా, టపాసుల మోతలతో గాంధీ భవన్ వద్ద హంగామా చేశారు. అంతకుముందు దాదాపు 500 కార్ల కాన్వాయ్ తో ఖమ్మం నుంచి ఆమె భారీ

మిగతా 2వ పేజీలో...

## రేవంత్‌తో గ్రేటర్ మేయర్ భేటీ

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** గ్రేటర్ హైదరాబాద్ మేయర్, కేకే కుమార్తె గద్వాల విజయలక్ష్మి సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం సీఎంతో సమావేశమైన ఆమె పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. అయితే ఇటీవల వరుసగా బీఆర్ఎస్ నేతలు సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుస్తున్నారు. కానీ దీని వెనుక రాజకీయం ఉ ందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీఎం ట్రాప్‌లో పడవద్దని ఎవరికీ చెప్పకుండా కలవొద్దని ఇటీవల ప్రతిపక్ష నేతగా సమవేశాన్ని ఏర్పాటు చేసినప్పుడు కేసీఆర్ అందరికీ చెప్పా-రు. పబ్లిక్ మీటింగుల్లో మాత్రమే కలిసి వినతి పత్రాలివ్వాలని సూచించారు. అయితే మేయర్ విజయలక్ష్మి రేవంత్ రెడ్డితో అనూహ్యంగా మర్యాదపూర్వక భేటీ నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దగా ఫలితాలు సాధించలేదు. దీంతో బీఆర్ఎస్ కీలక నేతలపై

మిగతా 2వ పేజీలో...



## బీఆర్ఎస్‌కు రాజయ్య గుడ్ బై

**వరంగల్, ప్రభాతసూర్యుడు :** పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ తాటికొండ రాజయ్య గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. అంతేకాదు.. అధికార కాంగ్రెస్ పార్టీలో చేరడానికి రంగం సిద్ధం చేసుకున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఈనెలలోనే కాంగ్రెస్ పార్టీలో చేరవచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి.గత అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ టికెట్ కోసం రాజయ్య తీవ్రంగా ప్రయత్నించారు. చివరి వరకు ఎదురుచూసి నిరాశ చెందారు. ఆయన ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గ టికెట్‌ను కడియం శ్రీహరికి అప్పగించారు. రాజయ్యను సముదాయించేందుకు.. రైతుబంధు సమితి ఛైర్మన్‌గా పదవి ఇచ్చారు. అయినా కూడా ఆయన పెద్దగా సంతృప్తి చెందలేదు. దీంతో అప్పటినుంచి అసంతృప్తితో రగిలిపోతున్న రాజయ్యకు పార్టీ పెద్దలు సర్దిచెప్పారు. ఎట్టకేలకు కేటీఆర్ సమక్షంలోనే



మిగతా 3వ పేజీలో...

## కలకలం రేపుతున్న ఈటెల కామెంట్స్

**కరీంనగర్, ప్రభాతసూర్యుడు :** ఈటల రాజేందర్ తెలంగాణ రాజకీయాలకు పరిచయం అక్కరలేని పేరు. తెలంగాణ ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ (టీఆర్ఎస్)లో రాజకీయాల్లోకి వచ్చిన నేత. పార్టీ ఆవిర్భావం నుంచి దాదాపు రెండు దశాబ్దాలపాటు అందులో కొనసాగారు. అంచలంచెలుగా ఎదిగి నంబర్ 2 స్థానానికి చేరుకున్నారు. కానీ, నంబర్ 2 స్థానంలో ఎవ-రున్నా తొక్కిపడేయడం కేసీఆర్‌కు అలవాటు. గతంలో ఆలె నరేంద్ర, విజయశాంతిని కూడా అలాగే చేశారు. రెండున్నరేళ్ల క్రితం ఈటల రాజేందర్ విషయంలో అదే చేశారు. మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయడమే కాకుండా, పార్టీ నుంచి వెళ్లిపోయేలా చేశారు. భూ కబ్జాల ఆరోపణలతో కేసులు పెట్టించారు. దీంతో ఈటల రాజేందర్ బీఆర్ఎస్‌తో 20 ఏళ్ల అనుబంధాన్ని తెంచుకున్నారు. ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసి ఉప ఎన్నికకు వెళ్లారు. ఆ సమ-యంలో కాంగ్రెస్, బీజేపీ రెండింటి నుంచి అవకాశం వచ్చినా.. కేసీఆర్‌ను ఎదుర్కొనాలంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలో చేరాలని నిర్ణయించుకుని కాషాయ కండువా కప్పుకున్నారు. ఇక రెండేళ్లుగా బీజేపీలో ఉంటున్న ఈటల రాజేందర్ ఆ పార్టీలో కీలక పదవులు కూడా నిర్వహించారు. చేరికల కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు. స్టార్ క్యాంపెయి నర్‌గా పనిచేశారు. ఎన్నికల కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. సీని యర్ నేత అయిన రాజేందర్‌కు బీజేపీ కూడా సముచిత స్థానమే కల్పించింది. అయితే ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన ఈటల మొన్నటి ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల నుంచి బరిలో దిగారు. హుజూరాబాద్‌తోపాటు, గజ్వేల్ నుంచి పోటీ చేశారు. కానీ రెండింటిలో

మిగతా 3వ పేజీలో...





## కాంగ్రెస్ ఎఫెక్ట్...

- కరెంట్ కష్టాలు షురూ...
- కేటీఆర్ కామెంట్స్

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంట్ కష్టాలు తప్పవని ఎన్నికల సమయంలో తాము చెప్పిన విషయం కేవలం 60 రోజుల్లోనే రుజువైందంటూ భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడిన కేటీఆర్.. కాంగ్రెస్ పై మరోసారి మాటలతూటాలు సంధించారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. మార్చి 17తో కాంగ్రెస్ సర్కార్‌కి వందరోజుల కాలం పూర్తవుతుందని, మరి 6 గ్యారంటీల్లో ఎన్ని అమలు అయ్యాయో.. ప్రజలు గ్రహించాలని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన అభివృద్ధి చూసి బీఆర్ఎస్ కు ప్రజలు పట్టంకట్టారని

మిగతా 4వ పేజీలో...

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## మేడారం జాతర పనులను పరిశీలించిన మంత్రి సీతక్క

**ములుగు, ప్రభాతసూర్యుడు :** మేడారం మహాజాతర పనులను మంత్రి సీతక్క పరిశీలించారు. కొండాయి గ్రామంలోని గోవిందరాజులు, నాగులమ్మ , సారలమ్మలను దర్శించుకున్నారు. దొడ్ల వద్ద జంపన్నవాగుపై కూలిపోయిన బ్రిడ్జిని పరిశీలించి అధికారులకు సూచనలు చేసారు. మంత్రి మాట్లడుతూ గత సంవత్సరం వరదలకి గోవిందరాజులు, సారలమ్మ, నాగులమ్మ ఆలయ ప్రాంతాలు కొట్టుకుపోయాయని అన్నారు. జాతర ప్రాంగణం, వివిధ మరమ్మత్తులకు బడ్జెట్ రిలీజ్ చేశాము. జాతర పనుల బిల్లులు ఇవ్వడంలో గత ప్రభుత్వం ఇబ్బందులు పెట్టింది. పాత బిల్లులు రాలేదని కాంట్రాక్టర్లు ప్రస్తుత జాతర పనులను ఆపితే ఊరుకునేది లేదు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేసారు. ఫారెస్ట్ అనుమతులు లేకపోవడంతో కొన్ని రోడ్ల నిర్మాణాలు ఆలస్యం అవుతున్నాయి. మరో నాలుగు రోజుల్లో అన్ని రోడ్ల నిర్మాణాలు పూర్తవుతాయని మంత్రి అన్నారు.

## కాంగ్రెస్ స్టేట్ ఇన్‌చార్జ్‌ను కలిసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి


**ఇబ్రహీంపట్నం -ప్రభాత సూర్యుడు :** కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి దీపా దాస్ మున్షి ని శనివారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి తిరుమల తిరుపతి ప్రసాదం అందజేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# పంచాయతీ పాలకవర్గానికి ఘనంగా సన్మానం

- పుట్టిన ఊరిని అభివృద్ధి చేయడం నా అదృష్టం
- గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి

**యాచారం - ప్రభాత సూర్యుడు :** యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామానికి గత ఐదు సంవత్సరాలుగా గ్రామ పెద్దల యువకుల, ప్రజల సహకారంతో గ్రామ అభివృద్ధి చేశానని గ్రామ సర్పంచ్ ఉదయశ్రీ రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన పదవి విరమణ ఆత్మీయ సమావేశంలో ఐదు సంవత్సరాలు ప్రజలకు సేవలు చేసిన గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు ఎంపీటీసీలను గ్రామపంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉదయశ్రీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో పుట్టి పెరిగి గ్రామాన్ని అభివృద్ధి చేయటం చాలా సంతోషకరంగా ఉందన్నారు. గ్రామ అభివృద్ధి ప్రజల సంక్షేమమే సేవ చేయాలనే సంకల్పంతో వచ్చిన నన్ను ఆదరించి అభిమానించి ఆశీర్వదించి అవకాశం కల్పించిన ప్రజలందరికీ రుణపడి ఉంటానని అన్నారు. ఐదు సంవత్సరాలలో పూర్తిచేసిన అభివృద్ధి మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నీళ్లు, వీధిలైట్లు, సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీలు, ట్రాక్టర్, ట్రాలీ, టాంకర్, పల్లె ప్రకృతి వనాలు, కంపోస్టు యాడ్, నర్సరీ, వైకుంఠధామం, పచ్చదనం పరిశుభ్రత, హరితహారం, సంక్షేమ పథకాలు గ్రామానికి అత్యధికంగా తీసుకురావడం జరిగిందన్నారు. కరోనా విపత్కర సమయంలో ప్రజలకు ధైర్యమిచ్చి తనదైన శైలిలో సహాయ సహకారాలు అందించి ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేసి సహకరించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పాలనలో విమర్శలు, ఎదురైన వెనకడుగు వేయకుండా ఇచ్చిన హామీలు నెరవేర్చుకుంటూ మా వంతు కృషి చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయ శ్రీ రవీందర్ రెడ్డి,బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి, గ్రామ పంచాయతీ సెక్రెటరీ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీటీసీ దేరంగుల శారద,కోఆప్షన్ సభ్యులు వంగూరి యాదయ్య, పుట్టమ్మ ,కారోబార్ నూకం మహేందర్ ,వార్డు సభ్యులు కొందూరు రామనాథం, ఓరుగంటి రాధిక, బండి ఉమారాణి, కొండాపురం నాగరాజు, మేకం శంకర్, హైమతి బేగం ,అయ్యగాని శోభ, బుచ్చమ్మ, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.







## ఆరుట్ల గ్రామ ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో శ్రీనివాస్


### కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాదగోని జంగయ్య గౌడ్

**మంచాల - ప్రభాత సూర్యుడు :** మంచాల మండలం గ్రామాల్లో సర్పంచుల పదవి కాలం ముగియడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగింది ఆరుట్ల గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా మంచాల మండలం ఎంపీడీవో చిలుకూరి శ్రీనివాస్ ను నియమించడంతో ఆరుట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంచాల మండలం కిసాన్ సెల్ మండలం అధ్యక్షుడు కావలి బుగ్గ రాములు ముదిరాజ్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జంగయ్య గౌడ్ ఇతర నాయకులతో కలిసి ఆరుట్ల ప్రత్యేక అధికారిగా నియమితులైన చిలుకూరి శ్రీనివాస్ ను శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కావలి బుగ్గ రాములు ముదిరాజ్ మాట్లాడుతూ ఆరుట్ల గ్రామ ప్రత్యేక అధికారి గా నియమితులైన శ్రీనివాస్ అధికారి గ్రామ ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉండి గ్రామంలో మంచి అధికారిగా పేరు తెచ్చుకోవాలి అన్నారు మేము ప్రత్యేక అధికారికి అన్ని రకాలుగా సహాయంగా ఉంటాం అని ఈ సందర్భంగా అన్నారు ఈకార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వేదిరె వెంకట రమణ రెడ్డి, ఎస్సీ సెల్ గ్రామ శాఖ అధ్యక్షుడు కంబాలపల్లి బుగ్గ రాములు తదితరులు పాల్గొన్నారు.

## మైలార్‌దేవ్‌పల్లిలో అక్రమ కట్టడాలు

### ఇద్దరు సిబ్బందిపై బదిలీ వేటు

**రంగారెడ్డి, ప్రభాతసూర్యుడు :** రాజేంద్రనగర్ మున్సిపాలిటీమైలార్ దేవ్ పల్లి పరిధిలోని ఇందిరా గాంధీ సొసైటీలో అక్రమ కట్టడాలను కూల్చివేతలో స్థానికులు జిహెచ్ఎంసి అధికారులు పై ఆరోపణలను ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో చైన్ మెన్ సత్యనారాయణ, న్యాక్ ఇంజనీర్ వెంకన్నలను చార్మినార్ జోనల్ ఆఫీసుకు అటాచ్ చేస్తూ రాజేంద్రనగర్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ ఆదేశాలు జారీ చేసారు. ఇందిరా గాంధీ సొసైటీ రెసిడెన్షియల్ కు అనుమతులు ఇస్తాం. అక్రమంగా నిర్మించిన 45 కమర్షియల్ షెడ్లు గుర్తించి నోటీసులు ఇచ్చామని అన్నారు. షెడ్ నిర్మించినవారు2రోజుల సమయం కావాలని అర్జీ పెట్టుకోవడంతో సమయం ఇచ్చామన్నారు. ఇంద్ర గాంధీ సొసైటీ నిర్మాణాల విషయంలో రిజిస్ట్రేషన్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్లకు అనుమతులు ఇవ్వవద్దంటూ అయా శాఖలకు లేఖలు రాస్తున్నామని డీసీ అన్నారు.



## బైకుల దొంగ అరెస్టు

**వికారాబాద్, ప్రభాతసూర్యుడు :** పార్కింగ్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకొని ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న నేరస్తుడిని వికారాబాద్ పోలీసలుఉ అరెస్ట్ చేసారు. నిందితుడు గత ఐదు సంవత్సరాల నుండి బైకులు చోరీ చేస్తున్ఆడు. బంట్వరం మండలం తొర్మమిడి గ్రామానికి చెందిన గుడాల మాణిక్యం (24) గతంలో బైక్ మెకానిక్ పని చేసిన అనుభవంతో బైక్ హ్యాండీల్ లాక్ విరగొట్టి బైక్ స్టార్ట్ చేసుకొని వెళ్ళేవాడు. ఇలా 12 బైకుల చోరికి పాల్పడ్డాడు వాటి విలువ సుమారుగా 1730000. ఆర్ సి పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని బైక్ ని దొంగతనం చేసి వెళ్తుండగా వికారాబాద్ రైల్వే స్టేషన్ దగ్గర పోలీసులు అదుపులోకి తీసుయకున్నారు. ఈ నేరస్థుడిపై 13 కేసులున్నాయని దాదాపు 10సార్లు జైలుకు కూడా వెళ్లాడని వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటి రెడ్డి తెలిపారు.

# ఒక రోజు తర్వాత కుడా అదే ఫుడ్డు

- మెనూను తుంగలో తొక్కిన కాంట్రాక్టర్
- తాండూర్ నెం1 స్కూల్ లో విద్యార్థుల వెతలు



**వికారాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణ ప్రభుత్వం పేద, మధ్యతరగతి చదువుకుంటున్న విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల అల్పాహారం పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిన జరిగింది. అయితే ఈ అల్పాహారాన్ని పథకాన్ని అదునుగా చేసుకున్న అల్పాహార కాంట్రాక్టర్లు తన అల్పబుద్ధి ప్రదర్శిస్తున్నారని చెప్పవచ్చు. విద్యార్థులు ఏమి చూడలే ఏదో ఒకటి తింటారు అనుకుంటూ రోజు ఉన్న మెన్యు లో సాంబార్ కు బదులు పొంగల్ సాంబార్ ను పంపిణీ చేశారు. దీంతో వాసన రావడంతో విద్యార్థులు అల్పాహారం తినక వెనుతిరిగి పోయారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా తాండూర్ నంబర్ వన్ ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకుంది..

శుక్రవారం ఉదయం తాండూర్ ప్రభుత్వ పాఠశాల నంబర్ వన్ పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న అల్పాహారాన్ని విద్యార్థులకు అంది స్తున్నారు. ఈ క్రమంలో నిన్నటి మెన్యు ప్రకారం పొంగల్ రైస్ ఉంది దీంతో నిన్నటి పొంగల్ రైస్ లో కొంతమంది విద్యార్థులే అల్పాహారం తిన్నారు. తీరా ఆ పొంగల్ రైస్ మిగిలిపోయింది. నేడు ఆ పొంగల్ రైస్ ను విద్యార్థులకు అందించే మెను ప్రకారం ఇడ్లీ సాంబార్ ఈరోజు ఉండగా సాంబార్‌కు బదులు నిన్నటి పొంగల్ రైస్ లో కొద్దిగా నీరు పోసి సాంబార్ గా పంపించారు. ఈరోజు ఉదయం అల్పాహారానికి వచ్చిన విద్యార్థులు అల్పాహారం తీసుకునే సందర్భంలో సాంబార్లో అన్నం, వాసన రావడంతో విద్యార్థులు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లారు దీంతో ఉపాధ్యాయులు పరిశీలించగా సాంబార్లో మొత్తం పొంగల్ రైస్ కనిపించింది. మరోవైపు వాసన రావడంతో విద్యార్థులు అల్పాహారం తినక తిరస్కరించారు. దీంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. సాంబార్‌లో అన్నం రైస్ రావడం వాసన ఉండడంతో తాము తినలేకపోయామని ఆందోళన వ్యక్తం చేశారు.

# రేవంత్‌తో గ్రేటర్ మేయర్ భేటీ

**మొదటిపేజీ తరువాయి..**
కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ ప్రయోగిస్తోందని చెబుతున్నారు. మేయర్ విజయలక్ష్మి తండ్రి కే.కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చాలా కాలం పాటు కీలక నేతగా వ్యవహరించారు. పీసీసీ చీఫ్ గా కూడా ఉన్నారు. అయితే తెలంగాణ ఉద్యమం తర్వాత బీఆర్ఎస్ లో చేరి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికవుతూ వస్తున్నారు. ఆయన కుమార్తె విజయలక్ష్మి గ్రేటర్ ఎన్నికల్లో గెలిచి మేయర్ సీటు పొందారు. మరో ఏడాదిలో గ్రేటర్ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. ఈ కారణంగా ఆమె కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అంటున్నారు. రేవంత్ రెడ్డిని కలవడానికి.. గ్రేటర్ పనులు కారణం కాదని రాజకీయాలేనని ఆమె వర్గీయులు చెబుతున్నారు. పదో తేదీన ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరొచ్చని చెబుతున్నారు. మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ కూడా కాంగ్రెస్ లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయన ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ లో బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఇటీవల ఆయనను అరెస్టు చేస్తారన్న ప్రచారం కూడా జరిగింది. ఇప్పుడు ఆయన కాంగ్రెస్ లో చేరడం మంచిదనుకుంటున్నట్లుగా చెబుతున్నారు. గ్రేటర్ లో పలువురు ఎమ్మెల్యేలతో కూడా కాంగ్రెస్ నేతలు చర్చలు జరుపుతున్నట్లుగా తెలుస్తోంది. గ్రేటర్ పరిధిలోకి వచ్చే పటాన్ చెరు, రాజేంద్రనగర్ ఎమ్మెల్యేలు ఇప్పటికే రేవంత్ రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తాము పార్టీ మారడం లేదని వారు చెబుతున్నారు కానీ.. ముందు చర్చలు జరిపారని.. కాంగ్రెస్ ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తే అప్పుడు పార్టీలో చేరుతారన్న చర్చ జరుగుతోంది.


## ఖమ్మం టిక్కెట్ కోసం భారీ ర్యాలీ

**మొదటిపేజీ తరువాయి..**
ర్యాలీగా తరలివచ్చారు. ఖమ్మం నగరంలోని శ్రీ లక్ష్మి నరసింహా స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన తర్వాత భారీ కాన్వాయ్ తో ర్యాలీగా హైదరాబాద్ వచ్చారు. ప్రత్యక్ష రాజకీయాలలో వస్తున్నానని, ఖమ్మం లోక్ సభ స్థానం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. సోనియా, ప్రియాంక పోటీకి దిగినా.. లేక హైకమాండ్ ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పని చేస్తామని తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే తమందరి లక్ష్యమని చెప్పుకొచ్చారు. ఖమ్మం లోక్సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు పలువురు నాయకులు ఆసక్తి చూపడంతో ఆసక్తి నెలకొంది. ఇటీవల మాజీ కేంద్రమంత్రి రేణుక చౌదరి ప్రెస్ మీట్ పెట్టి ఇక్కడి నుంచి సోనియా గాంధీ పోటీ చేస్తారని లేకుంటే, తానే బరిలో నిలుస్తానని స్పష్టం చేశారు. ఇదే సీటు కోసం కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి, మరో రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌లు కూడా పోటీలో ఉన్నారనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ తెలంగాణ నుంచి పోటీ చేస్తే.. ఖమ్మం లోక్‌సభ సెగ్మెంట్ నుంచి బరిలో ఉంటారనే వార్తలు కూడా వస్తున్నాయి. దీంతో ఇప్పుడు ఖమ్మం కాంగ్రెస్ పార్టీ హాట్‌సీటుగా మారిందనే చెప్పవచ్చు. తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్రంలోని 19 పార్లమెంట్ స్థానాలున్నాయి.ఈ 17 స్థానాల్లో మెజారిటీ స్థానాలను దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు రచిస్తుంది.ఈ మేరకు ఆయా పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఇంచార్జీలుగా మంత్రులను ఆ పార్టీ నియమించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఖమ్మంలో భారీ మెజార్టీ వచ్చింది. అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రత్యర్థులకు అందనంత దూరంలో ఉండటంతో గెలుపు ఖాయమని భావిస్తున్నారు. దీంతో టిక్కెట్ కోసం పోటీ పడే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. మల్లు భట్టి విక్రమార్క హైకమాండ్ వద్ద కూడా తన భార్యకు టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎవరి పేరునూ సిఫారసు చేయడం లేదని.. సోనియా గాంధీని మాత్రం పోటీ చేయాలని కోరుతున్నారని అంటున్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# హస్తం గూటికి ప్రభాకరరెడ్డి..?

**మెదక్, ప్రభాతసూర్యుడు :** గత కొద్ది రోజులుగా నిత్యం వార్తల్లో ఉంటున్నరు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి.. ఆయన ఏం చేసినా, చేయకపోయినా ఇటీవలి కాలంలో నిత్యం వార్తల్లో ఉంటున్నాడు. మొన్నటికి మొన్న ఉమ్మడి మెదక్ జిల్లా నుండి ముగ్గురు ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసినప్పటి నుండి ఈయన పైన పెద్ద చర్చే నడుస్తుంది. బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీష్ రావుకు అత్యంతసన్నిహితంగా ఉండే కొత్త ప్రభాకర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని మరో ముగ్గురు ఎమ్మెల్యేలతో కలిసి కలవడం పెద్ద సెన్సేషనల్ అయ్యింది. ఇప్పుడు ఇప్పుడే ఆ విషయం మరిచిపోతున్న తరుణంలో, కొత్త ప్రభాకర్ రెడ్డి అసెంబ్లీలో ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాకపోవడంతో మళ్ళీ ఆయన పై ఇటు బీఆర్ఎస్ పార్టీతో పాటు బయట కూడా మళ్ళీ చర్చ మొదలైంది. సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కానీ అందులో ఒక్క కొత్త ప్రభాకర్ రెడ్డి మాత్రమే కేసీఆర్ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి హాజరు కాలేదు. తన నియోజకవర్గ పరిధిలో ఏమైనా ముఖ్యమైన కార్యక్రమాలు ఉండి ఈ కార్యక్రమానికి హాజరు కాలేదా అంటే.. అదేం లేదంటున్నారు పార్టీ నేతలు. ఫిబ్రవరి 1వ తేదీన మొత్తం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హైదరాబాద్ లోనే ఉన్నాడట. హైదరాబాద్ లో ఉండి కూడా కేసీఆర్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి ఎందుకు హాజరు కాలేదు అనేది ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. కొత్త ప్రభాకర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ మారుతాడని, కాంగ్రెస్ పార్టీలో చేరుతారని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారట.. అందుకే ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశాడని, తనతో పాటు మరో ముగ్గురు ఎమ్మెల్యేలను తీసుకెళ్లాడని ప్రచారం చేస్తున్నారట. సీఎం రేవంత్ రెడ్డిని కలవడానికి కొత్త ప్రభాకర్ రెడ్డే అపాయింట్మెంట్ తీసుకున్నాడని, ఆ విషయం బీఆర్ఎస్ పార్టీ పెద్దలకు కూడా తెలియదు అని, కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యతిరేక వర్గం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోరుగా ప్రచారం చేస్తున్నారట. త్వరలోనే కారు పార్టీ నుండి, హస్తం పార్టీలోకి మారుతాడనే ఒక ప్రచారం జోరుగా జరుగుతున్న సమయంలో, కేసీఆర్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన కార్యక్రమానిక కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరు కాకపోవడం అనేది ఇప్పుడు అందరిని ఆలోచనలో పడేసిందట. కొత్త ప్రభాకర్ రెడ్డికి ఎమ్మెల్యే కావలనేది చాలా రోజుల కల. అతను మెదక్ ఎంపీగా బీఆర్ఎస్ పార్టీ నుండి రెండు సార్లు గెలిచాడు. ఎంపీగా ఉన్నప్పటి నుండి ఎమ్మెల్యే కావలనేది ఆయన కల. అందుకే మొన్న జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ దుబ్బాక ఎమ్మెల్యే టికెట్‌ను కొత్త ప్రభాకర్ రెడ్డి ఇచ్చారు. మాజీ మంత్రి హరీష్ రావుకు అత్యంత నమ్మకస్థుడుగా పేరు ఉంది. ఎన్నికల ప్రచారంలో కూడా ప్రభాకర్ రెడ్డిపై కత్తి దాడి జరిగినప్పుడు ఆయనను ఆసుపత్రిలో చేర్పించి, ప్రచార బాధ్యతను మొత్తం చూసుకుంది కూడా హరీష్ రావునట. బీఆర్ఎస్ పార్టీలో కూడా కొత్త ప్రభాకర్ రెడ్డికి మంచి పేరే ఉందని, ప్రభాకర్ రెడ్డి పార్టీ మారుతాడనే జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని బీఆర్ఎస్ పార్టీ కొట్టి పారేస్తుందట. హరీష్ రావుని కాదని కొత్త ప్రభాకర్ రెడ్డి అలాంటి నిర్ణయం తీసుకోరని బీఆర్ఎస్ పార్టీ వాళ్ళు గట్టి నమ్మకంతో ఉన్నారట. దుబ్బాకలో కొత్త ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలవడం, పార్టీ అధికారం కోల్పోవడం ఎమ్మెల్యేకు సరైన ప్రోటోకాల్ ఇవ్వడం లేదని ముఖ్యమంత్రి కలిశాడని చెబుతున్నా.. ఇటీవలి కాలంలో కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యవహార శైలి మాత్రం కొంత ఎవరికి అంతు చిక్కడం లేదని, కేసీఆర్ ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి ఎందుకు హాజరుకాలేదు..? పార్టీకి చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవడంపై కేసీఆర్ ఏమైనా మందలించి ఉంటాడా..? లేదా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన తర్వాత కేసీఆర్‌ను కలిసే ధైర్యం చేయలేక పోతున్నాడా? ఇలా అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి..!



# బీఆర్ఎస్‌కు రాజయ్య గుడ్ బై



**మొదటిపేజీ తరువాయి..**
కడియం శ్రీహరికి సహకరిస్తానని, కలిసి పనిచేస్తానని ఎన్నికలకు ముందే తెలిపారు. కడియం ఎమ్మెల్యేగా గెలిచినా.. పార్టీ మాత్రం పవర్ నుంచి పోయింది. ఈ క్రమంలోనే కొంతకాలంగా మౌనంగా ఉన్న రాజయ్య పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ సిద్ధంగా ఉన్నాననే సంకేతాలు అధిష్టానానికి పంపారు. అయితే, పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆయనకు టికెట్ కేటాయించేందకు అధిష్టానం సుముఖంగా లేకపోవడంలో ఇక గుడ్ బై చెప్పడమే సరైన నిర్ణయం అని భావించి పార్టీ మార్పుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కార్యకర్తలతో మాట్లాడి త్వరలోనే నిర్ణయం చెబుతానని.. ఆయన టీవీ9తో ప్రత్యేకంగా చెప్పారు. టిక్కెట్ దక్కకున్నా పార్టీకి వీరవిధేయుడిగా ఉన్నానన్నారు. అయినా అధిష్ఠానం నుంచి మాత్రం స్పందన కరువైందన్నారు. క్షేత్రసాయిలో బీఆర్ఎస్‌కు ఆదరణ కరువైందన్నారు. పార్టీ విధి విధానాలు తనకు నచ్చడం లేదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచిన కాంగ్రెస్‌ను కూలుస్తాం అంటూ బీఆర్ఎస్ నేతలు అనడం కరెక్ట్ కాదన్నారు.

# కలకలం రేపుతున్న ఈటెల కామెంట్స్

**మొదటిపేజీ తరువాయి..**
ఓడిపోయారు. కేసీఆర్ టార్గెట్‌గా పనిచేసినా ఫలితం లేకపోయింది. మరోవైపు ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన హుజూరాబాద్ ఓటర్లు కూడా ఈసారి ఈటలను ఓడించారు. ఇటీవల ఓ యూట్యూబ్ చానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిన ఈటల రాజేందర్ పార్టీ మార్పుపై చాలా రోజుల తర్వాత స్పందించారు. పార్టీ మారిన కొత్తలో కమ్యూనిస్టు భావాలు ఉన్న నేత బీజేపీలో ఒదుగుతారా అన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. కానీ, రెండేళ్ల తర్వాత ఇప్పటికీ ఆ పార్టీలో ఇంకా ఒదిగిపోనట్లు తెలుస్తోంది. యూట్యూబ్ చానెల్ ఇంటర్వ్యూలో తాను పార్టీ మారి తప్పు చేశానని చెప్పకే చెప్పారు. తనలా ఎవరూ తప్పు చేయొద్దని సూచించారు. 20 ఏళ్లు ఉన్న పార్టీలో దక్కిన గౌరవం కొత్త పార్టీలో కోరుకోవడం అత్యాశే అవుతుందన్నారు. అయినా సర్దుకుపోతున్నట్లు వెల్లడించారు. ఇప్పుడు ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# భద్రాద్రిని దర్శించుకున్న హరీష్ రావు

**భద్రాద్రి, పభాతసూర్యుడు :** భద్రాద్రి శ్రీ సీతారామచం ద్రస్వామిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు శనివారం దర్శించుకున్నారు. అయన వెంట ఎంపీ రవిచంద్ర, ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఎమ్మెల్సీ తాత మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వున్నారు.


# తెలంగాణలో ఎంపీ సీట్ల కోసం రథయాత్ర



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమవుతోంది బీజేపీ తెలంగాణ. ఇప్పటికే పార్లమెంట్ సెగ్మెంట్ల వారీగా సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తూ వస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన మేర సీట్లు రాకపోవటంతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం మెజార్టీ సీట్లను గెలుచుకోవాలని భావిస్తోంది. గత లోక్ సభ ఎన్నికల్లో ఏకంగా 4 ఎంపీ స్థానాలను గెలిచి సత్తా చాటింది కాషాయదళం. అయితే ఈసారి మాత్రం రెండంకెల సంఖ్యను దాటాలని చూస్తోంది. అందుకు తగ్గట్టే కార్యాచరణను రూపొందించి ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తోంది. ఇందులో భాగంగా కీలకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. ఎన్నికలు సమీపించిన వేళ రాష్ట్రవ్యాప్తంగా రథయాత్రను చేపట్టేందుకు సిద్ధమైంది బీజేపీ తెలంగాణ నాయకత్వం. ఫిబ్రవరి 5 నుంచి ప్రారంభించే అవకాశం ఉంది. రాష్టంలోని 119 నియోజకవర్గాలను కవర్ చేసేలా ఈ యాత్రను చేపట్టనున్నట్లు పార్టీ వర్గాల మేరకు తెలిసింది. ఇటీవలే జరిగిన పార్టీ సమావేశంలో ఈ యాత్రపై చర్చించినట్లు సమాచారం. రాష్ట్రం మొత్తం కవర్ అయ్యేలా 5 క్లస్టర్లుగా విభజించి? యాత్ర సాగేలా చూస్తోంది. పార్టీ సీనియర్ నేతలు ఈ యాత్రలో పాల్గొననున్నారు. 2019 లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ పార్టీ 4 సీట్లను గెలుచుకోవాలని సరికొత్త చరిత్ర సృష్టించింది. నిజానికి 2018 డిసెంబర్ లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒక్క సీటుకే పరిమితమైన బీజేపీ ఆరు నెలల వ్యవధిలోనే జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రమే సత్తా చాటింది. ప్రధాన పార్టీలుగా ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ లకు గట్టి షాక్ ఇచ్చింది. ఈసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ 8 ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకుంది. ఓటింగ్ శాతం కూడా పెంచుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ కంటే కుండా ఎక్కువ ఎంపీ సీట్లను గెలుచుకోవాలని చూస్తోంది. ఈ ఎన్నికల్లో గతంలో నిలబడ్డిన సిట్టింగ్ ఎంపీలతో పాటు కీలక నేతలను బరిలో ఉంచేలా కేంద్ర నాయకత్వం కూడా కసరత్తు చేస్తోంది. గత నెలలోనే అమిత్ షా తెలంగాణ పర్యటనకు రావాల్సి ఉన్నప్పటికీ చివరి నిమిషంలో టూర్ రద్దు అయింది. ఒకేరోజు మూడు జిల్లాల్లో సమావేశాలు ఖరారైనప్పటికీ అమిత్ షా టూర్ క్యాన్సిల్ అయింది. త్వరలోనే మళ్లీ అమిత్ షా రాష్ట్రానికి రానున్నారు. పలు పార్లమెంట్ సెగ్మెంట్ల నేతలతో సమీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. ఈసారి దక్షిణాది నుంచి ఎక్కువ ఎంపీ సీట్లను ఆశిస్తున్న బీజేపీ తెలంగాణపై భారీగానే ఆశలు పెట్టుకునే అవకాశం కనిపిస్తోంది. గత ఫలితాల దృష్ట్యాఈసారి మరింత కష్టపడితే సీట్ల సంఖ్య పెరగవచ్చని లెక్కలు వేసుకుంటోంది. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ప్రధాని మోదీ పర్యటనలు కూడా ఉండొచ్చని తెలుస్తోంది.

# రథయాత్ర నుంచి భారతరత్న వరకు...

**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు :** లాల్‌కృష్ణ అద్వానీ. ఇలా కాకుండా ఎల్‌కే అద్వానీ అంటేనే అందరికీ తెలుసు. బీజేపీని ముందుండి నడిపించిన రథసారథుల్లో చాలా కీలకమైన వ్యక్తి ఆయన. 1951లో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జన సంఘ్‌ని స్థాపించారు. అప్పుడే తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభిం చారు అద్వానీ. 1970లో రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు. 1989 వరకూ అదే పదవిలో కొనసాగారు. ఆ తరవాత జన సంఘ్ కాస్తా భారతీయ జన సంఘ్‌గా మారింది. 1972లో ఈ పార్టీకి ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు అద్వానీ. 1975లో మొరార్జీ దేశాయ్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ప్రసార మాధ్యమ శాఖ మంత్రిగా పని చేశారు. ఆ తరవాత 1980లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి తీసుకొచ్చేం దుకు కృషి చేశారు. అటల్ బిహారీ వాజ్‌పేయీ తో కలిసి పార్టీని ముందుకు నడిపించారు. అయితే...1990ల తరవాతే ఆయనకు జనాల్లో మంచి పాపులారిటీ వచ్చింది. రామజన్మభూమి ఉద్యమంతో ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించారు. అప్పుడు మొదలైన ఉద్యమమే ఇప్పుడు అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి కారణమైంది. వాజ్‌పేయీ క్యాబినెట్‌లో ఉప ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించారు. బీజేపీకి జాతీయ అధ్యక్షుడిగా మూడు సార్లు పని చేశారు. 1986-90లో ఆ తరవాత 1993-98 మధ్య కాలంలో ఈ బాధ్యతలు చేపట్టారు. మళ్లీ 2004-05 లో జాతీయ అధ్యక్షుడిగా ఏడాది పాటు సేవలు అందించారు. దాదాపు మూడు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఆయన తొలి సారి హోం మంత్రిగా పదవీ బాధ్యతలు చేప ట్టారు. ఆ తరవాత 1999-2004 వరకూ వా జ్‌పేయీ హయాంలో ఉప ప్రధానిగా చేశారు. అద్వానీకి రథసారథి అనే పేరుంది. అందుకు కారణం...ఆయన చేపట్టిన రథయాత్ర. 1990లో సెప్టెంబర్ 25వ తేదీన గుజరాత్‌లోని సోమ్‌నాథ్‌లో ఈ యాత్ర ప్రారంభించారు అద్వానీ. 1992లో డిసెంబర్ 6వ తేదీన బాబ్రీ మసీదుపై దాడితో అది ముగిసింది. ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. రామజన్మ భూమి ఉద్యమాన్ని మలుపు తిప్పింది. ఆ మలు పు తరవాత మరెన్నో మలుపులు తిరిగి చివరకు రామ మందిర నిర్మాణ కల నెరవేరింది. రాజనీతి జ్ఞుడిగా ఎంతో పేరు గడించారు అద్వానీ. మేధా శక్తితో పాటు నమ్మిని విలువలకు కట్టుబడి ఉం డడం ఆయనకు మాత్రమే సొంతమైన ప్రత్యే కత. 1927లో నవంబర్ 8వ తేదీన జన్మించారు లాల్‌కృష్ణ అద్వానీ. భారత్ పాకిస్థాన్ విడిపోక ముందు సింధ్ ప్రావిన్స్‌లో పెరిగారు. కరాచీ లో విద్యాభ్యాసం చేశారు. విద్యార్థి దశ నుంచే దేశభక్తి ఎక్కువ. ఆ సమయంలోనే భావజాలం ఆయనను ఆకర్షించింది. జాతీయవాద సిద్ధాంతంపై ఆకర్షితుడైన ఆయన 14 ఏళ్లకే ఖీూలో చేరారు. 1980ల నుంచి 1990 వరకూ బీజేపీని జాతీయ స్థాయిలో బలపరచాలన్న ఒకేఒక లక్ష్యంతో పని చేశారు అద్వానీ. ఆ శ్రమ వృథా కాలేదు. 1989లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. అంతకు ముందు 1984లో 86 సీట్ల మ్యాజిక్ ఫిగర్‌కి రెండు సీట్ల తక్కువ సాధించి అధికారాన్ని కోల్పోయింది. ఆ తరవాతే అద్వానీ మరింత పట్టుదలగా పని చేసి 1989లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. 1992లో రామజన్మభూమి ఉద్యమంతో బీజేపీకి జాతీయ స్థాయిలో ఆదరణ లభించింది. అప్పుడు జరిగిన ఎన్నికల్లో 121 సీట్లు సాధించింది. ఆ తరవాత 1996లో 161 సీట్లతో అధికారంలోకి వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అధికారంలో ఉన్న కాంగ్రెస్ తొలిసారి గద్దె దిగాల్సి వచ్చింది. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా బీజేపీ అవతరించింది. బీజేపీ అధికారంలోకి వచ్చి అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. కానీ...13 రోజులకే ఆ ప్రభుత్వం పడిపోయింది. అయితే...1996లో జరిగిన ఎన్నికల్లో అద్వానీ పోటీ చేయలేదు. 1998లో ఈ స్కామ్‌లో క్లీన్‌చిట్ వచ్చిన తరవాత మళ్లీ మెజార్టీతో ఎన్నికయ్యారు. "జాతీయవాదం విషయంలో ఆయన ఎప్పుడూ రాజీ పడలేదు. పరిస్థితులకు తగ్గట్టుగా రాజకీయాలు చేయడం ఆయనకు మాత్రమే చెల్లింది" అని అటల్ బిహారీ వాజ్‌పేయీ ఎల్‌కే అద్వానీపై ఓ సందర్భంలో ప్రశంసలు కురిపించారు. 1990-97 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా బీజేపీ అంతగా బలపడింది అంటే అందుకు కారణం కేవలం అద్వానీయే అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత ఘటనకు ముందు అద్వానీ విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రసంగించారంటూ ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో హిందుత్వానికి అద్వానీని బ్రాండ్ అంబాసిడర్‌గా భావించారు. హిందుత్వ విలువలను కాపాడుకోవాలన్న ఆయన విధానమే బీజేపీ రాజకీయ సిద్ధాంతమైంది. ఆయన రాజకీయ ప్రస్థానంలో రామ్ రథ యాత్రతో పాటు జనదేశ్ యాత్ర, భారత్ సురక్షా యాత్ర, స్వర్ణ జయంతి రథ్ యాత్ర, భారత్ ఉదయ్ యాత్ర..ఇలా పలు యాత్రలు చేపట్టారు. మొత్తంగా రాజకీయాల్లో ఇలా రథయాత్రల ట్రెండ్‌ని మొదలు పెట్టింది అద్వానీయే. రామ్‌రథ్ యాత్రతో అయోధ్య ఉద్యమానికి ఊపు తీసుకొచ్చారు. ఇటీవల జరిగిన రామ మందిర ప్రారంభోత్సవానికి ముందుగా ఆయనకు ఆహ్వానం అందలేదు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఆ తరవాత ట్రస్ట్ ఆయనకు ఆహ్వానం పంపింది. కానీ...వయసు రీత్యా ఆయన హాజరుకాలేకపోయారు. కానీ...రామ మందిర నిర్మాణం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న వాళ్లంతా ఆ రోజు ఆయన పేరునే తలుచుకున్నారు. ఆయన సేవల్ని గుర్తించి



2015లో భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఇప్పుడు అత్యున్నత పురస్కారమైన భారతరత్నను కట్టబెట్టింది.

## భారతరత్నం.. అద్వానీ..

**మొదటిపేజీ తరువాయి..**
పార్టీ ప్రధాన కార్యదర్శి. జనతా పార్టీ ప్రభుత్వంలో సమాచార, ప్రసార శాఖ మంత్రిగా వున్నారు. 1977-79 వరకూ కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రిగా వున్నారు. 1980 ఏప్రిల్ 6న భారతీయ జనతా పార్టీని స్థాపించారు. 1996లో 13 రోజులకే బీజేపీ ప్రభుత్వం కుప్పకూలడంతో 1998లో మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటుచేసారు. 1999 ఎన్నికల్లో గెలిచి వాజ్పేయూ సర్కార్ లో కేంద్ర హోంమంత్రిగా, దేశ ఉపప్రధానిగా అద్వానీ విధులు నిర్వహించారు. కేంద్ర గనులు, బొగ్గు శాఖ మంత్రిగా అద్వాణీకి అదనపు బాధ్యతలు తీసుకున్నారు. కేంద్ర సిబ్బంది, శిక్షణా మంత్రిత్వగా అద్వానీకి అదనపు బాధ్యతలు ఇచ్చారు. 2004లో ప్రతిపక్ష నాయకుడిగా పనిచేసారుర. 2009 ఎన్నికల్లో బీజేపీ ప్రధాని అభ్యర్థిగా అద్వానీ పోటీ చేసారు. 2014 ఎన్నికల్లో మోదీ ప్రధాని అభ్యర్థిగా బీజేపీ గెలుపొందారు. 2014 ఎన్నికల్లో గాంధీనగర్ నుంచి అద్వానీ గెలిచారు. – 2019లో క్రియాశీల రాజకీయాలకు పూర్తిగా దూరమైయారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# అందోల్ లో మంత్రి దామోదర పర్యటన



సంగారెడ్డి, ప్రభాతసూర్యుడు : ఆందోల్ నియోజకవర్గంలో మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం పర్యటించారు. ఆందోల్ లో నూతనంగా నిర్మించే 150 పడకల ఆస్పత్రి, నర్సింగ్ కాలేజీ, హాస్టల్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేసారు. తరువాత ఆందోల్ పాలిటెక్నిక్ కళాశాలని మంత్రి  ఆకస్మికంగా తనిఖీ చేసారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కారం చేయాలని అధికారులకు ఆదేశం ఇచ్చారు.

## సంపాదకీయమ్..

# మళ్లీ తెరపైకి దక్షిణ దేశం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌పై విపక్షాలు అసహనం వ్యక్తం చేశాయి. సామాన్యులకు ఊరటనిచ్చే అంశం బడ్జెట్‌లో లేదని విమర్శించారు. అయితే, కర్ణాటక కాంగ్రెస్ నేత, లోక్‌సభ ఎంపీ డీకే సురేశ్ దక్షిణ భారతాన్ని ప్రత్యేక దేశంగా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ పార్లమెంటు వేదికగా చేసి ప్రకటన దేశవ్యాప్తంగా పెద్ద దుమారమే రేగుతోంది.మధ్యంతర బడ్జెట్‌పై బెంగళూరుకు చెందిన కాంగ్రెస్ ఎంపీ డీకే సురేష్ మాట్లాడుతూ.. ఇది ఎన్నికల బడ్జెట్ అని అన్నారు. పథకాలకు కొన్ని సంస్కృత పేర్లు, హిందీ పేర్లు ప్రవేశపెట్టారన్నారు. కేంద్రం దక్షిణ భారత రాష్ట్రాలకు జీఎస్టీ, ప్రత్యక్ష పన్నుల్లో వాటా ఇవ్వడం లేదని ఆరోపించారు. దక్షిణ భారత రాష్ట్రాలు అన్యాయానికి గురవుతున్నాయని, దక్షిణాది రాష్ట్రాల నుంచి వసూలు చేసిన సొమ్మును ఉత్తర భారత రాష్ట్రాలకు ఇస్తున్నారని మండిపడ్డారు. ఇది ఇలాగే కొనసాగితే ప్రత్యేక దేశం కోసం డిమాండ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు డీకే సురేశ్. కేంద్రం రాష్ట్రాల నుంచి రూ.4 లక్షల కోట్లకు పైగా వసూలు చేస్తోందని, దానికి ప్రతిఫలంగా అందుతున్నదీ స్వల్పం అన్నారు. దీన్ని సరిదిద్దుకోకుంటే దక్షిణాది రాష్ట్రాలన్నీ ప్రత్యేక దేశాన్ని డిమాండ్ చేస్తూ గళం విప్పాల్సి వస్తుందని హెచ్చరించారు.ఎంపీ డీకే సురేశ్ చేసిన ప్రత్యేక దేశం వ్యాఖ్యలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఖండించారు. 'దేశాన్ని విచ్ఛిన్నం చేసేలా మాట్లాడే వారెవరైనా.. ఏ పార్టీకి చెందిన వారైనా సరే.. సహించేదీ లేదన్నారు మల్లికార్జున్ ఖర్గే. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు మనం ఒక్కటేనని, మనం ఒక్కటిగానే ఉంటామని స్పష్టం చేశారు. డికె సురేష్ ప్రత్యేక దేశం డిమాండ్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం రాజ్యసభలో ప్రకటన చేశారు.డీకే సురేశ్ వ్యాఖ్యలపై భారతీయ  జనతా పార్టీ ఎంపీలు తీవ్రస్థాయిలో అభ్యంతరం చెప్పారు. కాంగ్రెస్ నాయకులు క్షమాపణలు చెప్పాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఆఐ సురేష్ భారత రాజ్యాంగంపై దాడి అని, దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను అవమానించేలా మాట్లాడారని, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి మండిపడ్డారు. తమ పార్టీ ఎంపీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని లోక్‌సభ ఎథిక్స్ కమిటీకి సూచించాలని డిమాండ్ చేశారు జోషి.మరోవైపు బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యతో మాటల యుద్ధానికి దిగిన డీకే సురేష్ తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. ఈమేరకు తన చీ హ్యాండిల్‌లో సమాధానం ఇచ్చారు. "రాష్ట్రకవి కువెంపు, మన నాద గీతంలో, 'జయ భారత జననీయ తనుజాతే, జయ హే కర్ణాటక మాథే' అని పోస్ట్ చేశారు. కాంగ్రెస్ విభజన రాజకీయాలు చేస్తోందని ఆరోపిస్తూ, "కాంగ్రెస్ పార్టీకి 'విభజించు ? పాలించు' చరిత్ర ఉందని ఆరోపించారు. దాని ఎంపీ డీకే సురేష్ ఇప్పుడు ఉత్తర ? దక్షిణాదిని విభజించాలని కోరుతూ మళ్లీ ట్రిక్ ప్లే చేస్తున్నారు" అని బిజెపి ఎంపి విమర్శించారు. యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటి కంటే ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో పన్నుల విభజన చాలా ఎక్కువైందని ఆయన అన్నారు. "2009-14 నుండి జఖం-2 సమయంలో కర్ణాటకకు పన్నుల పంపిణీ రూ. 53,396 కోట్లుగా ఉండగా, 2014-19లో నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో రూ.1.35 లక్షల కోట్లు దాటింది" అని సూర్య పేర్కొన్నారు. అటు ఇటీవల ఐదు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో గెలిచింది. తెలంగాణలో ఆ పార్టీ 8 సీట్లకే పరిమితమైంది. దీనిపై సామాజిక మాధ్యమాలలో వాదోపవాదాలు సాగుతున్నాయి.ఎన్నికల ఫలితాలు వచ్చాకా కొంతమంది వ్యక్తులు, దక్షిణ బారతాల మధ్య విభజన చిచ్చు రగిల్చేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఓ జర్నలిస్టు పోస్టు చేసిన వీడియోను ప్రధాని నరేంద్ర మోదీ కూడా రీపోస్టు చేశారు."ఈ విభజన అజెండా పట్ల జాగ్రత్తగా ఉండాలి. 70 ఏళ్ళ ఈ అలవాటు అంత తొందరగా పోదు" అని ప్రధాని మోదీ రాశారు.దీనికీతోడు డీఎంకే ఎంపీ సెంథిల్ కుమార్ పార్లమెంటులో హిందీ బెల్ట్ రాష్ట్రాలలో బీజేపీ గెలుపుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కానీ, తరువాత తన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పారు.జమ్మూ కశ్మీర్‌కు సంబంధించిన రెండు బిల్లుపై పార్లమెంటులో జరిగిన చర్చలో సెంథిల్ కుమార్ మాట్లాడుతూ " గోమూత్ర రాష్ట్రాలుగా పిలిచే హిందీ బెల్ట్ రాష్ట్రాలలోనే బీజేపీ బలంగా ఉందని ఈ దేశ ప్రజలు నమ్ముతున్నారు. అక్కడ మాత్రమే ఆ పార్టీ గెలవగలదు" అన్నారు.అలాగే "మీరు దక్షిణ భారతంలో అడుగుపెట్టలేరు. మేం తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటకలలో బలంగా ఉన్నాం. అందుకే మీరు వీటిని కేంద్ర పాలిత ప్రాంతాలుగా ప్రకటించి మీరు పరోక్షంగా అధికారం చెలాయించినా మేమేమీ ఆశ్చర్యపోము. ఎందుకంటే కలలలో కూడా మీరు దక్షిణాది రాష్ట్రాలలో అధికారంలోకి రాలేరు" అన్నారు.జమ్మూ కశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) చట్టం, జమ్మ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టంపై జరిగిన చర్చ సందర్భంగా సెంథిల్ కుమార్‌పై విధంగా మాట్లాడారు.అయితే అధికార భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీ కూడా సెంథిల్ వ్యాఖ్యలను ఖండాంచాయి. డీఎంకే కూడా సెంథిల్ వ్యాఖ్యలకు దూరంగా ఉంది. దీనిపై తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కె. అన్నామలై స్పందిస్తూ " ఉత్తర భారతం వారిని పానీపూరి అమ్మేవారుగానూ, టాయిలెట్లు కట్టేవారంటూ విమర్శ చేసిన డీఎంకే ఎంపీ 'ఇండి కూటమి'లో భాగస్వామి అయిన ఎంపీ గోమూత్రం గురించి పరిహసిస్తున్నారు" అన్నారు.అయితే సెంథిల్ కుమార్ పార్లమెంటులో తాను చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పారు. కానీ బీజేపీ ఈ వ్యాఖ్యలపై ఇంకా కోపంగానే ఉంది. కేంద్రమంత్రి మీనాక్షి లేఖి ఈ వ్యాఖ్యలు 'సనాతన సంప్రదాయాన్ని, సనాతన వాదులను' అవమానించడమేనన్నారు.

# కాకతీయ వర్శిటీపై దృష్టి

వరంగల్, ప్రభాతసూర్యుడు : కాకతీయ యూనివర్సిటీ ప్రక్షాళన దిశగా అడుగులు పడుతున్నట్టు తెలుస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎంత పెద్ద వివాదం తెరమీదకు వచ్చినా.. కనీస చర్యలు చేపట్టని వర్సిటీ పాలకులు తాజాగా మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. మొన్నటికి మొన్న పాల బిల్లు క్లియర్ చేసేందుకు లంచం డిమాండ్ చేస్తూ ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా చిక్కగా.. ఆయనను వీసీ సస్పెండ్ చేసేశారు. ఎప్పటినుంచో రిటైర్డ్ ప్రొఫెసర్ రిజిస్ట్రార్ గా కొనసాగడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తినప్పటికీ లైట్ తీసుకున్న వర్సిటీ పాలకులు బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా అడ్మినిస్ట్రేషన్ విభాగంలో భారీ మార్పులు చేపట్టారు. రిజిస్ట్రార్ గా కొనసాగుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ కు ఉద్వాసన పలకడంతో పాటు వివిధ విభాగాల్లోనూ మార్పులు చేశారు. దీంతో కాకతీయ యూనివర్సిటీ ప్రక్షాళన జరుగుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.తెలంగాణ స్టేట్ యూనివర్సిటీ యాక్ట్ సెక్షన్ 15.1 ప్రకారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ గా రెగ్యులర్ ప్రొఫెసర్లనే నియమించాలి. అంటే రిటైర్డ్ అయి పెన్షన్ తీసుకునే ప్రొఫెసర్లు అర్హులు కారన్నమాట. అయినా కేయూలో ఆ రూల్ కు విరుద్ధంగా దాదాపు ఏడాదిన్నర కిందట వీసీ తాటికొండ రమేశ్ రిటైర్డ్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావును రిజిస్ట్రార్ గా నియమించడం వివాదాస్పదమైంది. దీంతో పలుమార్లు విద్యార్థి, ఉద్యోగ సంఘాల నేతలు ఆందోళనలు చేపట్టి, రిజిస్ట్రార్ గా కొనసాగుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ ను ఆ బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ కూడా చేశారు. అయినా గత ప్రభుత్వ పెద్దల సహకారంతో వీసీ రమేశ్ రిజిస్ట్రార్ గా శ్రీనివాసరావునే కొనసాగిస్తూ వచ్చారు. ఇదిలాఉంటే ఇప్పటికే కాకతీయ యూనివర్సిటీ అక్రమాలకు అడ్డాగా మారిందనే ఆరోపణలుండటం, వీసీ రమేశ్ కు పదవీ గండం పొంచి ఉందనే ప్రచారం జరగడంతో ఎట్టకేలకు ఆయన మార్పులకు శ్రీకారం చుట్టినట్టు తెలిసింది. దీంతో బుధవారం అడ్మినిస్ట్రేషన్ విభాగంలో మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే రిటైర్డ్ ప్రొఫెసర్ ను రిజిస్ట్రార్ పదవీ నుంచి తొలగించడం గమనార్హం.వర్సిటీలో మార్పులు చేపట్టిన వీసీ రమేశ్ బుధవారం పలువురి పోస్టులు మార్చారు.




ఇందులో ప్రధానంగా దూరవిద్యాకేంద్రం డైరెక్టర్గా, వర్సిటీ రిజిస్ట్రార్ గా కొనసాగుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావును ఆ పదవి నుంచి తొలగించారు. తిరిగి ఆ స్థానంలో వర్సిటీలో నాలుగు కీలక పోస్టుల బాధ్యతలు మోస్తున్న ప్రొఫెసర్ మల్లారెడ్డికి అవకాశం ఇచ్చారు. ఈ మేరకు బుధవారం సాయంత్రమే ప్రొఫెసర్ మల్లారెడ్డి నూతన రిజిస్ట్రార్ గా బాధ్యతలు తీసుకున్నారు. ఇక ఎస్డీఎల్సీఈ డైరెక్టర్ గా ప్రొఫెసర్ వి.రామచంద్రంను నియమించారు. యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల కో ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ గా ఉన్న మల్లారెడ్డి రిజిస్ట్రార్ గా బాధ్యతలు చేపట్టడంతో ఆ స్థానంలో ప్రొఫెసర్ ఎం.సదానందంకు పోస్టింగ్ ఇచ్చారు. ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ గా ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాల ప్రిన్సిపల్ గా ప్రొఫెసర్ పి.అమరవేణిని నియమించారు. సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కాలేజీ ప్రిన్సిపల్ గా ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, యూనివర్సిటీ వ్యాయమ కళాశాల ప్రిన్సిపల్ గా డాక్టర్ ప్రసాద్ ను నియమిస్తూ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేశారు.రాష్ట్రంలో ఉస్మానియా తరువాత అంతటి ప్రాధాన్యం ఉన్న కాకతీయ యూనివర్సిటీ ఇప్పుడు వివాదాలకు అడ్డాగా మారింది. వీసీ ఏకపక్ష ధోరణితోనే వర్సిటీ అప్రతిష్టపాలవుతోందనే ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి రూమ్ మేట్ కావడంతోనే వీసీగా ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ను నియమించారనే ఆరోపణలుండగా.. కొందరు ఇదే విషయమై కోర్టుకు వెళ్లడంతో దానిపై కోర్టులో కేసులు కూడా నడుస్తున్నాయి. ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోగా.. మరోసారి వీసీగా కొనసాగుతాననే ధీమాతో ఉన్న వీసీ రమేశ్ సెల్ఫ్ డిఫెన్స్ లో పడినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే పదవీకాలం దగ్గర పడుతున్న సమయంలో కొత్తగా అడ్మినిస్ట్రేషన్ లో మార్పులకు శ్రీకారం చుట్టారనే అభిప్రాయాలు వ్యక్తవవుతున్నాయి. ఎన్నడూ లేనివిధంగా ఒకేసారి కీలక విభాగాల్లో మార్పులు చేయడం కూడా వర్సిటీలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇదిలాఉంటే కాకతీయ యూనివర్సిటీ ఇప్పటికే వివాదాల్లో చిక్కుకోవడం, యజీసీ కూడా ఇక్కడి వ్యవహారాలపై ఫోకస్ పెట్టడంతోనే వీసీ చర్యలకు ఉపక్రమించారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మార్పులు జరిగాయనే ప్రచారం ఉండగా.. వీసీ ముస్ముందు కూడా ఇలాగే కొనసాగుతారో.. లేదా షరా మామూలే అన్నట్టుగా వ్యవహరిస్తారో చూడాలి.

# కోఠి ఉమెన్స్ కాలేజీ విద్యార్థినిల అందోళన

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : కోటి ఉమెన్స్ కాలెజ్ ముందు పీజీ విద్యార్థినిలు ఆందోళనకు దిగారు. మేనేజ్మెంట్ అటానమస్ సెమిస్టర్ కి 5000 చొప్పున ఫీజు నిర్ణయించడం జరిగిందని హాస్టల్ లో కూడా సరైన వసతులు లేవని వాటర్   వసతి లేదని ఆందోళన చేపట్టారు. ఇంతకుముందు ఈ యొక్క ఫీజు 3,500 మాత్రమే ఉండేదని ఫీజు తగ్గించాలంటూ కోటి ఉమెన్స్ కాలేజ్ గేటు వద్ద మహిళా విద్యార్థినిలు కూర్చొని ఆందోళన చేపట్టారు. పెంచిన ఫీజును తగ్గించాలని ధర్నాకు దిగారు. అందులో ముఖ్యమైనవి సరైన టాయిలెట్స్ లేకపోవడం త్రాగునీరు వెసులుబాటు లేకపోవడం మొదలగునవి ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




# కాంగ్రెస్ ఎఫెక్ట్...

మొదటిపేజీ తరువాయి..

కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే వాళ్ళు చేసే పని గుర్తుకొస్తుందన్నారు. ఇచ్చిన మోసపూరిత హామీలతో కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిందని.. పదేళ్లలో కరెంట్ పోలేదు, కానీ ఇప్పుడు కాంగ్రెస్ రాగానే కరెంట్ పోతుందంటూ ఫైర్ అయ్యారు. డిసెంబర్9న రైతులు లోన్లు తెచ్చుకోమన్నారు.. ఇప్పటి దాకా రుణమాఫీ చేయలేదని కేటీఆర్ గుర్తుచేశారు. డిసెంబర్ 9, జనవరి 9 పోయింది ఫిబ్రవరి 9వచ్చింది ఇంకా రుణమాఫీ కాలేదంటూ విమర్శించారు. 500 రూపాయల బోనస్ రైతులకు ఇస్తామన్నారు.. కానీ ఇవ్వలేదని కేటీఆర్ గుర్తుచేశారు. 70 ఏళ్ల వ్యక్తి కేసిఆర్ ను నోటికొచ్చినట్లు రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు.. సీఎం స్థాయి మరిచి కేసిఆర్ ను తిడుతున్నారంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మార్చి 17 తర్వాత రేవంత్ రెడ్డికి గట్టి సమాధానం ఇస్తామని కేటీఆర్ స్పష్టంచేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని అంటున్నారు.. పదేళ్లు మోడీ తమకు సహకరించకపోయిన తాము ఇచ్చిన హామీలు నెరవేర్చామన్నారు. కానీ రేవంత్ రెడ్డి కి ఇలా ఇచ్చిన హామీలపై వెనక్కి తగ్గటం మంచిది కాదంటూ కేటీఆర్ అభిప్రాయపడ్డారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడే ఎంపీలు ఉండాలని.. కానీ దూడు బసవన్న లాగే ఉండే ఎంపిలు అవసరం లేదంటూ కేటీఆర్ పేర్కొన్నారు.

**కాంగ్రెస్ పై ఫైర్..**

కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే వారణాసిలో పోటీ చేసి గెలవాలని, కాంగ్రెస్ పార్టీ తనకున్న 40 స్థానాలను కూడా ఈసారి



నిలబెట్టుకునే అవకాశం లేదంటూ కాంగ్రెస్ పార్టీ పైన బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నానని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి వల్లనే ఇండియా కూటమి చెల్లాచెదురు అవుతున్నదని.. కాంగ్రెస్ పార్టీ ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. గుజరాత్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో బిజెపితో నేరుగా పోటీ పడాల్సి ఉన్న కాంగ్రెస్, ఆ రాష్ట్రాలను వదిలిపెట్టి ఇతర రాష్ట్రాల్లో ఇతర పార్టీలతో పోటీ పడుతుందన్నారు. దీంతో బిజెపికి లాభం చేకూరుతుందని.. ఇండియా కూటమిలోని పార్టీల గెలుపు అవకాశాలను దెబ్బతీసేలా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని వ్యాఖ్యానించారు. నిజానికి బిజెపిని ఆపగలిగే శక్తి కేవలం బలమైన ప్రాంతీయ రాజకీయ శక్తులకే ఉన్నదన్నారు. మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రి వాల్, స్టాలిన్, కేసీఆర్ వంటి బలమైన నాయకులే దేశంలో బిజెపిని అడ్డుకోగలరని.. బిజెపికి కాంగ్రెస్ ఏ మాత్రము ప్రత్యామ్నాయము కాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.



# కవితకు అర్హత లేదు

- కవిత లిక్కర్ స్కాంలో ప్రజల సొమ్మును దొచుకోలేదా!
- కవిత బీజేపీ కేంద్ర అగ్రనేతల కాళ్లు మొక్కి ఆ కేసు నుంచి తప్పించుకోలేదా!
- నిలదీసిన మంత్రి కొండా సురేఖ

వరంగల్, ప్రభాతసూర్యుడు : : ప్రజాసొమ్ము దుర్వినియోగం గురించి మాట్లాడే అర్హత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత  కు లేదని మంత్రి కొండా సురేఖ  తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నాడు మంత్రి సురేఖ మీడియాతో మాట్లాడుతూ... భద్రాద్రి సీతారాములకు కేసీఆర్ మనవడు ఏ హోదాలో పట్టు వస్త్రాలు తీసుకెళ్లారని ప్రశ్నించారు. ఆ సొమ్ము కేసీఆర్ సొంత డబ్బులు కాదని.. ప్రజల సొమ్ము అని నిలదీశారు. కల్వకుంట్ల కుటుంబం, బీఆర్ఎస్ నేతలు ప్రజల సొమ్మును అప్పనంగా దోచుకు తిన్నారని ధ్వజమెత్తారు. కవిత లిక్కర్ స్కాంలో ప్రజల సొమ్మును దొచుకోలేదా అని ప్రశ్నించారు. కవిత బీజేపీ కేంద్ర అగ్రనేతల కాళ్లు మొక్కి ఆ కేసు నుంచి తప్పించుకోలేదా అని నిలదీశారు. కవిత ఎక్కడ నుంచైనా ఎంపీగా పోటీ చేయొచ్చని.. ఆమెను తెలంగాణ ప్రజలు ఓడగొట్టి ఇంటికి పంపుతారని మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. చిల్లర విమర్శలు మానుకోవాలికవిత వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయన్నారు. తాము తెలంగాణ ప్రజలకు జవాబుదారీగా ఉంటామని, బీఆర్ఎస్ నేతలకు అసలే కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై చిల్లర విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. కవిత మహాత్మ జ్యోతిరావుపూలే గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పూలే గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. బతుకమ్మ, జాగృతి పేరుతో ప్రజల్లో ఉండాలని కవిత చూస్తున్నారని.. ఆమె పప్పులు ఇక ఉడకవని మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215